ఆదివారం 12-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 332, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

# అంతా నిశ్శబ్దం..!

- ముగిసిన ప్రచార హోరు
- తెలుగు రాష్ట్రాల్లో మూగబోయిన మైకులు
- అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ఈసీ దృష్టి

**ముందడుగు జాతీయం:**

తెలుగు రాష్ట్రాల్లో ప్రచార జోరు ముగిసింది. శనివారం సాయంత్రం మైకులు మూగబోయాయి. సార్వత్రిక ఎన్నికల నాలుగో దశలో భాగంగా తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు, ఏపీలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరగనుంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలైన అరకు, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటలకు, సమస్యాత్మక నియోజకవర్గాలైన పాలకొండ, కురుపాం, సాలూరులో 5 గంటలకు ప్రచారం నిలిపివేశారు. రాష్ట్రంలోని మిగతా 169 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రచారం పరిసమాప్తమైంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు దాదాపు 90 ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి తరపున ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.






## తెలంగాణలో పోటాపోటీ

తెలంగాణలోని 106 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు, 13 సమస్యాత్మక సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓటింగ్‌కు నిర్దేశించిన సమయం ప్రకారమే శనివారం సాయంత్రం ప్రచారానికి గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాస, భాజపాలు అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నాయి. మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పరస్పర విమర్శలు, ఆరోపణలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. రాష్ట్రంలోని 16 స్థానాల్లో మూడు ప్రధాన పార్టీలు తీవ్రంగా పోటీపడుతుండగా, హైదరాబాద్‌లో మాత్రం ఎంఐఎం కీలకంగా ఉంది.




## డ్రగ్స్, మద్యానికి బానిసై కుటుంబాన్ని హత్య చేసి తాను ఆత్మహత్య

వివరాలు 3లో



## చేతిలో పిస్తోల్‌తో ఇన్‌స్టా రీల్స్ డాన్స్

వివరాలు 3లో



## రాజ్యాంగాన్ని తొలగించే ప్రయత్నం జరుగుతోంది

- పేదలు బతుకుల గురించి మోడీ ఆలోచించరు
- ఎన్నికలప్పుడే ధర్మం అనే నినాదం ఎత్తుకుంటారు
- తాండూరులో కాంగ్రెస్ జనజాతరలో ప్రియాంక

**ముందడుగు వికారాబాద్:**

దేశంలో రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగించాలనే ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో పేదలను మిగతా 2లో

## పోలింగ్ సిబ్బందికి పోషకాలతో కూడిన ఆహారం


వివరాలు 3లో

## దేశం దాటాలంటే కోర్టు అనుమతి కావాలి

వివరాలు 3లో

## కాంగ్రెస్ పార్టీని ప్రజలు కాటేయబోతున్నారు

- శాసనసభలో చిలిపి ప్రయత్నాలు చేశారు
- తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ముంచడం ఖాయం
- మాజీ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు



వివరాలు 3లో



## కడుపులో పదికోట్ల డ్రగ్స్ సరఫరా

వివరాలు 4లో

ముందడుగు
ఆదివారం, 12-5-2024, హైదరాబాద్

# కాంగ్రెస్ పార్టీని ప్రజలు కాటేయబోతున్నారు



**ముందడుగు తెలంగాణ:**

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు కాటేయబోతున్నారని, అందులో ఎలాంటి అనుమానం లేదని, ప్రజలు కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని మాజీ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేసారు.

ఈ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలను మించి ఎక్కువ స్థానాల్లో బీఆర్ఎస్ అద్భుతంగా గెలవబోతుంది, ఇందులో సందేహం లేదన్నారు. ఈ రెండు ప్రభుత్వాల ఆచరణ, అవలంభించిన తప్పుడు విధానాలు ప్రజల్లోకి వెళ్లాయని

చెప్పారు. వాటిని మేం చెప్పగలిగామని వివరించారు. దాని ఫలితమే బీఆర్ఎస్ అద్భుతమైన విజయం సాధించబోతుంది అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డిపై విమర్శలు

కాంగ్రెస్ పార్టీకి చెందిన అర్భక ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం చాలా తప్పులు చేసిందని విమర్శించారు. ఎప్పుడు కానీ ఇంతకుముందు ఉన్న ప్రభుత్వం మారి వేరే ప్రభుత్వం కొలువు దీరినప్పుడు గత ప్రభుత్వం ఏ విధానాలో అవలంభించిందో ఇంటర్నల్ సమీక్షలు చేసి మెరుగైన పనితనం చూపించాలన్నారు. ఇది సహజంగా కనిపించేదేనని వివరించారు. భిన్నంగా అసహజమైన పద్ధతుల్లో ఒక పాలసీ లేకుండా, రైతులు, ఇండస్ట్రీ, పవర్, ఇరిగేషన్ సెక్టార్‌ను పక్కన పెట్టి అమూల్యమైన సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వేస్ట్ చేశారని మండిపడ్డారు. శాసనసభలో కూడా చిలిపి ప్రయత్నాలు చేశారని వ్యాఖ్యానించారు.



# రాజ్యాంగాన్ని తొలగించే ప్రయత్నం జరుగుతోంది

మొదటిపేజీ తరువాయి

ఆదుకునే పథకాలేవీ ఉండవని చెప్పారు. రైతుల, నిరుపేదలు, మహిళల కోసం ఆ ప్రభుత్వం ఏమీ చేయదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో గ్యాస్ సిలిండర్ రూ.1200 ఉందని, తెలంగాణలో రూ.500కే ఇస్తున్నామని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ప్రియాంక ప్రసంగించారు.

బిజెపి పాలనలో పేదలపై వేసే పన్నులు నిరంతరం పెరుగుతూనే ఉంటాయి. పేద రైతులు రూ.50 వేలు, రూ.లక్ష రుణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారికి రుణమాఫీ చేసేందుకు భాజపా సర్కార్ అంగీకరించదు. కానీ, బడా వ్యాపారులకు మాత్రం భాజపా సర్కార్ రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసింది. కీలకమైన సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకొని ఆడిస్తోంది. ప్రజలు ఎలా బతుకుతున్నారో తెలుసుకునే ప్రయత్నాన్ని మోదీ ఎప్పుడూ చేయరు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం వచ్చి ధర్మం అనే నినాదం ఎత్తుకుంటారు. ప్రజల మధ్య మతం చిచ్చు పెట్టి ఓట్లు వేయించుకుంటారని ఆరోపించారు.

# చేతిలో పిస్తోల్‌తో ఇన్‌స్టా రీల్స్ డాన్స్

**వీడియో వైరల్ కావడంతో రంగంలోకి పోలీసులు**



**ముందడుగు లక్నో:**

సోషల్ మీడియా మోజులో పడి ఎవరెలా ప్రవర్తిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎక్కువగా ఇప్పుడు అందరూ ఇన్‌స్టా రీల్స్ పై దృష్టి సారించారు. పాపులర్ అయ్యేందుకు ఆ సోషల్ మీడియా ఓ వేదికైంది. దీంతో చాలా మంది రకరకాల వీడియోలతో అట్రాక్ట్ చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్‌కు వినూత్న ప్రయోగాలు చేసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల లక్నో హైవేపై ఓ అమ్మాయి తన చేతిలో పిస్తోల్‌తో ఆ రీల్స్ కోసం డ్యాన్స్ చేసింది. పాపులర్ యూట్యూబర్ సిమ్రన్ యాదవ్..లక్నో హైవేపై ఓ భోజ్‌పురి పాటపై స్టెప్పులేసింది. ఇన్‌ఫ్లుయెన్సర్ డ్యాన్స్ చేస్తున్న వీడియోను ఓ అడ్వకేట్ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశాడు. వీడియో వైరల్‌కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆ అమ్మాయిపై చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన పట్ల విచారణకు ఆదేశించినట్లు పోలీసులు వెల్లడించారు. వీడియో పట్ల సోషల్ మీడియాలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ పై నిషేధం

- జూన్ 1వ తేదీ సాయంత్రం ప్రకటించుకోవచ్చు
- మే 13న వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశం
- మీడియాతో సీఈవో వికాస్ రాజ్




**ముందడుగు హైదరాబాద్ :**

తెలంగాణలో ఎగ్జిట్ పోల్స్ పై నిషేధం విధిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సీఈవో వికాస్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ ను నిషేధిస్తున్నట్లు చెప్పారు. అలాగే మే 13న వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని వికాస్ రాజ్ హెచ్చరించారు. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రచార సమయం ముగిసిన తర్వాత ఎవరు కూడా ప్రచారం చేయకూడదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిఘా మరింత పెంచినట్లు తెలిపారు. మే11న సాయంత్రం ప్రచారం ముగిసిన తర్వాత స్థానికేతరులు నియోజకవర్గాల్లో ఉండొద్దని చెప్పారు. జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ ప్రకటించుకోవచ్చన్నారు. ఏపీలో కూడా ఎగ్జిట్ పోల్స్ ను నిషేధించారు. జూన్ 1 సాయంత్రం 6:30 గంటల వరకు నిషేధం కొనసాగనుంది. లోక్ సభ ఎన్నికలు 6 దశల్లో నిర్వహిస్తున్నారు. మొదటి దశలో భాగంగా ఏప్రిల్ 19న 21 రాష్ట్రాల్లో 102 సీట్లకు పోలింగ్ జరిగింది. రెండో దశలో భాగంగా ఏప్రిల్ 26న 13 రాష్ట్రాల్లో 89 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. మూడో దశలో భాగంగా మే 7న 12 రాష్ట్రాల్లో 94 సీట్లలో పోలింగ్ జరిగింది. నాలుగో దశ మే 13న 10 రాష్ట్రాల్లో 96 స్థానాలకు పోలింగ్ జరగనుంది. నాలుగో దశలోనే తెలంగాణ, ఏపీలో ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఏపీలో లోక్ సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఐదో దశలో మే 20న 8 రాష్ట్రాల్లో 49 సీట్లలో ఎన్నికలు జరగనున్నాయి. ఆరో దశలో మే 25న 7 రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఏడో దశలో జూన్ 1న 8 రాష్ట్రాల్లో 57 సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. చివరి దశ పోలింగ్ తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు రానున్నాయి.

# 75 ఏళ్లు నిండిన మోడీనే ప్రధాని

## కేజ్రీవాల్ వ్యాఖ్యలపై అమిత్ షా



**ముందడుగు ఢిల్లీ:**

భారతదేశానికి నరేంద్ర మోడీనే మళ్లీ ప్రధానమంత్రి అవుతారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆయన మూడోసారి పాలనను పూర్తి చేస్తారని చెప్పారు. వచ్చే ఏడాది ప్రధాని మోడీకి 75 ఏళ్లు నిండుతాయని, అప్పుడు ఆయన పదవీ విరమణ చేస్తారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను సీఎం పదవి నుంచి దించుతారని, అమిత్ షాను ప్రధానిని చేస్తారని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలపై అమిత్ షా స్పందించారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. 'మోదీజీకి 75 ఏళ్లు నిండినందుకు సంతోషించాల్సిన అవసరం లేదని అరవింద్ కేజ్రీవాల్‌కు, ఇండియా బ్లాక్‌కు నేను చెప్పాలనుకుంటున్నా. మోడీజీ ప్రధాని కాలేరని బీజేపీ రాజ్యాంగంలో లేదు. మళ్లీ ఆయనే ప్రధాని అవుతారు. పదవీ కాలాన్ని పూర్తి చేస్తారు' అని అన్నారు.

ముందడుగు
ఆదివారం, 12-5-2024, హైదరాబాద్

# పోలింగ్ సిబ్బందికి పోషకాలతో కూడిన ఆహారం

## ఎండ కాలం కావడంతో ప్రత్యేక మెను ఏర్పాటు

**ముందడుగు తెలంగాణ:**



తెలంగాణ ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యారెట్ ద్వారా ఓటు వేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, పోలీసులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

ఎండాకాలం కావడంతో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా మంచి ఆహారం అందించాలని సూచించింది. సిబ్బంది ఆదివారం సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు వెళ్తారు. వారు పోలింగ్ కేంద్రాలకు చేరుకోగానే.. మజ్జిగ, సమోసా ఇస్తారు. సాయంత్రం 5 గంటలకు నిమ్మరసం లేదా మజ్జిగ ఇవ్వనున్నారు. రాత్రి భోజనం 7 నుంచి 8 గంటల మధ్యలో అందివ్వనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మధ్యాహ్న భోజనం ఇస్తారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు కర్రీ, సాంబారు, పెరుగు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం నిమ్మ రసం లేదా మజ్జిగ ఇస్తారు. సాయింత్రం టీతో పాటు బిస్కెట్లు ఇవ్వనున్నారు. ఇదంతా పట్టణాల్లో అయితే మున్సిపాలిటీ, వారు గ్రామాల్లో అయితే గ్రామపంచాయితీ వారు చూసుకుంటారు.

# ఏపీకి వెళ్లేందుకు బారులు తీరిన వాహనాలు

**ఖాళీ అవుతున్న హైదరాబాద్ ▪ నగర శివారల్లో భారీగా ట్రాఫిక్ జామ్**

**ముందడుగు హైదరాబాద్:**



ఏపీకి చెందిన ఓటర్లు ఓటు వేసేందుకు వెళ్తుండడంతో హైదరాబాద్ నగరం ఖాళీ అవుతోంది. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఏపీ ఓటర్లు సొంత గ్రామాలై బాట పట్టారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఒక్కొక్కరిగా బయల్దేరారు. శనివారం భారీగా వెళ్తోన్నారు. దీంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతోన్నాయి. చాలా మంది సొంత వాహనాల్లో ఏపీకి బయల్దేరారు. దీంతో నగర శివారల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొర్లపాడు టోల్ గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఫాస్ట్ ట్యాగ్ స్కానింగ్ లేటవుతుండడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇటు విజయవాడ రూట్ లోని పంతంగి టోల్ ప్లాజా వద్ద కూడా ట్రాఫిక్ కొనసాగుతోంది. బస్సులు దొరక్క పోవడంతో చాలా మంది సొంత వాహనాల్లో వెళ్తోన్నారు. దాదాపు ఏపీకి చెందిన 30 లక్షల మంది ఓటర్లు హైదరాబాద్ లో ఉన్నారు. వీరంతా సొంతూళ్లకు వెళ్తే హైదరాబాద్ లో ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది.

# డ్రగ్స్, మద్యానికి బానిసై కుటుంబాన్ని హత్య చేసి తాను ఆత్మహత్య



**ముందడుగు క్రైం:**

ఒక వ్యక్తి డ్రగ్స్, మద్యానికి బానిసైన వ్యక్తి ఉన్మాదిలా మారాడు. తల్లిని కాల్చి చంపి, భార్యను సుత్తితో తలపై కొట్టి హత్య చేశాడు. మేడ పైనుంచి ముగ్గురు పిల్లలను కిందకు విసిరేసి చంపాడు. ఆ తర్వాత గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో జరిగింది. పల్హాపూర్ గ్రామానికి చెందిన 42 ఏళ్ల అనురాగ్ సింగ్, మాదకద్రవ్యాలు, మద్యానికి బానిస అయ్యాడు. మానసిక వికలాంగుడైన అతడు తరచుగా కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో అతడిని డీ అడిక్షన్ సెంటర్‌కు పంపాలని కుటుంబ సభ్యులు భావించారు. శనివారం మద్యం సేవించిన అనురాగ్ సింగ్ మళ్లీ కుటుంబంతో గొడవ పడ్డాడు. ఈ నేపథ్యంలో డీ అడిక్షన్ సెంటర్‌లో చేరాలని కుటుంబ సభ్యులు కోరారు. దీంతో ఉన్మాదిలా మారిన అతడు ఇంట్లో విధ్వంసం సృష్టించాడు. తొలుత గదిలో ఉన్న 65 ఏళ్ల తల్లి సావిత్రిని గన్‌తో కాల్చి చంపాడు. తర్వాత 40 ఏళ్ల భార్య ప్రియాంక తలపై సుత్తితో కొట్టి హత్య చేశాడు. అనంతరం ముగ్గురు పిల్లలైన 12 ఏళ్ల అశ్విని, 9 ఏళ్ల ఆర్నా, 6 ఏళ్ల అద్విక్‌ను మేడ పైనుంచి కిందకు విసిరేయడంతో వారు చనిపోయారు. ఆ తర్వాత అనురాగ్ సింగ్ గన్‌తో కాల్చుకోవడంతో అతడు కూడా మరణించాడు.

# గవర్నర్ వీడియో పెన్‌డ్రైవ్ నా దగ్గర ఉంది

- లైంగిక వేధింపుల గవర్నర్ రాజీనామా చేయాలి
- ఆయన ఉన్నంతకాలం రాజ్‌భవన్‌కు వెళ్లను
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

**ముందడుగు పశ్చిమబెంగాల్:**



ఓ మహిళ పశ్చిమబెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్‌పై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ ఆరోపణలను ఖండించిన గవర్నర్.. ఘటన జరిగినట్లుగా చెబుతున్న మే 2వ తేదీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని సాధారణ పౌరులకు చూపించారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఆ వీడియోలు ఎడిటెడ్ అని ఆరోపించారు. గవర్నర్ ఇంకా తన పదవికి ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ''ఎడిట్ చేసిన వీడియోను గవర్నర్ విడుదల చేశారు. నేను మొత్తం ఫుటేజీ చూశాను. అందులో దిగ్భ్రాంతి కలిగించే దృశ్యాలున్నాయి. దీంతో పాటు మరికొన్ని వీడియోల పెన్‌డ్రైవ్ నా దగ్గర ఉంది. ఆయన ప్రవర్తన చాలా అభ్యంతరకరంగా ఉంది'' అని దీదీ దుయ్యబట్టారు. దీదీగిరిని సహించబోనని గవర్నర్ అంటున్నారు. కానీ ఆయన దాదాగిరీ ఇక పని చేయదు. మహిళలపై వేధింపులకు పాల్పడిన ఆయన పదవి నుంచి దిగిపోవాలి. ఇంతవరకు ఎందుకు రాజీనామా చేయలేదో కారణాలు చెప్పాలి. ఆయన గవర్నర్‌గా ఉన్నంతకాలం నేను రాజ్‌భవన్‌కు వెళ్లను'' అని మమత అన్నారు.



# దేశం దాటాలంటే కోర్టు అనుమతి కావాలి

- ఆడబిడ్డలు అదృశ్యమైతే ఒక్కమాట మాట్లాడరు
- ఇలాంటి సిఎం మన రాష్ట్రానికి అవసరమా
- కాకినాడ సభలో పవన్ కళ్యాణ్

**ముందడుగు కాకినాడ:**

ఆంధ్రప్రదేశ్ సీఎం దేశం దాటి వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 32వేల మంది ఆడబిడ్డలు అదృశ్యమైతే జగన్ ఒక్క మాట మాట్లాడలేదన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కాకినాడలో నిర్వహించిన సభలో పవన్ ప్రసంగించారు. ''కాకినాడకు రక్షణ కల్పించే మడ అడవులను ధ్వంసం చేస్తున్నారు. గంజాయి, మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చా. నాకు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. సమాజంలో మార్పు రావాలనే రాజకీయాల్లోకి వచ్చా. పార్టీలు మారే వ్యక్తులు కాదు.. స్థిరంగా ఉండే వారు మనకు కావాలి. వైకాపాకు ఓటేస్తే చేజేతులా గూండా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నట్టే. సమాజాన్ని కాపాడాలి.. ధర్మాన్ని నిలబెట్టాలి.. అదే నా విధానం అన్నారు. ఎన్నికల్లో కూటమిదే అఖండ విజయం'' అని పవన్ కల్యాణ్ అన్నారు.

ముందడుగు

ఆదివారం, 12-5-2024, హైదరాబాద్

# పద్మశ్రీ పూర్ణమాసి కాళ్లు మొక్కిన మోడీ

**గిరిజన కవయిత్రికి బహిరంగసభలో సన్మానం**




**ముందడుగు ఒడిశా:**

ఒడిశా రాష్ట్రానికి చెందిన గిరిజన కవయిత్రి పూర్ణమాసి జానికి .. ప్రధాని నరేంద్ర మోడీ పాదాభివందనం చేశారు. రాష్ట్రంలోని ఖందమాల్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన స్టేజ్‌పై పద్మశ్రీ పూర్ణమాసి జానిని సన్మానించారు. ఆ తర్వాత ఆమె పాదాలకు మొక్కి ఆశీస్సులు తీసుకున్నారు. 80 ఏళ్ల పూర్ణమాసి జాని ఓ కవి, సామాజిక కార్యకర్త. ఆమె సుమారు 50 వేల భక్తి పాటలు రాశారు. ఒడియా, కుయి, సంస్కృతం భాషాల్లో ఆమె ఆ పాటల్ని కంపోజ్ చేశారు. గిరిజన సంస్కృతి, కళల కోసం శ్రమించిన పూర్ణమాసికి 2021లో పద్మశ్రీ అవార్డు దక్కింది. ఆమెను పాపులర్‌గా తడిసోరు భాయి అని పిలుస్తారు.

# కడుపులో పదికోట్ల డ్రగ్స్ సరఫరా

**ముంబై విమానాశ్రయంలో బ్రెజిల్ దేశస్థుడు అరెస్ట్**



**ముందడుగు క్రైం:**

బ్రెజిల్ దేశస్థుడు సినీ ఫక్కీలో డ్రగ్స్ సరఫరా చేస్తుండగా ముంబై ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. 9.75 కోట్ల విలువైన 975 గ్రాముల కొకైన్ స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అరెస్ట్ చేసింది.

అనంతరం అతడిని కోర్టులో హాజరుపరిచారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ కింద అతన్ని అరెస్ట్ చేశామన్నారు. 1,108 గ్రాముల బరువున్న డ్రగ్ క్యాప్సూల్స్‌ను బ్రెజిల్ దేశస్థుడి శరీరం నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలోని జెజె ఆసుపత్రి వైద్యులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో భాగంగా నిషేధిత మాదక ద్రవ్యాన్ని భారత్ కు తరలించే ప్రయత్నంలో కొకైన్ క్యాప్సూల్స్ తీసుకున్నట్లు ఆ వ్యక్తి డిఆర్ఐ అధికారులకు చెప్పాడు. కోర్టు ఆదేశాల మేరకు జేజే ఆస్పత్రిలో సదరు వ్యక్తిని చేర్పించారు. వైద్యుల బృందం అతని పొత్తికడుపు నుండి ఏకంగా 74 కొకైన్ క్యాప్సూల్స్ ను తొలగించినట్లు అధికారి తెలిపారు.





# ఇంకెన్నిసార్లు ఓడిపోతారు..

- నాయకులు కాదు ప్రజలు గెలవాలి
- రాజకీయ మార్పుకు శ్రీకారం చుడదాం
- అందరూ ఓటెస్తేనే మార్పు సాధ్యం
- జెడీ లక్ష్మినారాయణతో ముందడుగు



**ముందడుగు విశాఖపట్నం**

ప్రతి సారి ఎన్నికల్లో ప్రజలు ఓడిపోతూనే ఉన్నారని, ఇంకెన్ని సార్లు మీరు ఓడిపోతారని ఉత్తర విశాఖ ఎమ్మెల్యే అభ్యర్థి జెడీ లక్ష్మినారాయణ అన్నారు. శనివారం ప్రచారం చివరి రోజున తన నియోజకవర్గంలో పర్యటించారు. పలు ప్రాంతాల్లో ప్రజలను కలుస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు కూడా లక్ష్మినారాయణను ఆత్మీయంగా పలుకరిస్తూ జై భారత్ పార్టీకి మద్దతు తెలిపారు..

## నిశ్శబ్ద విప్లవంలా జెడి ప్రచారం


ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు అంటే ఏలా ఉంటారు. నాయకుడి చుట్టూ నానా హంగామా, మంది, మార్బలం కనిపిస్తారు. ప్రచారానికి ఏ గల్లీకి వెళ్లినా మైకులు హోరెత్తుతాయి. బరిలో ఉండే నాయకుడి ప్రచారం ఎంతోగాని, కిందిస్థాయి వాళ్ల హడావుడే అక్కడ కనిపిస్తోంది. పోటీలో ఉన్న నాయకుడు కూడా వాడవాడలా అలా నమస్కారం పెడుతూ వెళుతుంటారు. కాని విశాఖ ఉత్తరంలో పోటీ చేస్తున్న మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ మాత్రం వెంట ఒక్కరు, ఇద్దరు ఉన్న ప్రచారంలోకి దూసుకుపోతున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి ఆత్మీయంగా పలకరిస్తూ జై భారత్ పార్టీ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తున్నారు.

## ఆసక్తిగా గమనిస్తున్న ఓటరు

అవినీతిపరులను ఆటకట్టించినా సిబిఐ మాజీ జెడీ లక్ష్మినారాయణను ఇప్పటివరకు టీవిలలో, పేపర్లలో చూసిన ప్రజలు నేరుగా తమ ఇంటికే వచ్చే సరికి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ప్రతి ఓటరు ఆసక్తి గమనిస్తున్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి నాయకుడే కావాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. పెద్ద పోలీసు ఆఫీసర్ గా పనిచేసిన జెడీ లక్ష్మినారాయణ ఇప్పుడు రాజకీయ నాయకుడిగా ప్రజల వద్దకు వచ్చిన తీరు ఓటర్లను ఆకట్టుకుంటుంది. జరగబోతున్న ఎన్నికల్లో వైజాగ్ పరిరక్షణకు, నగర అభివృద్ధికి ప్రశ్నించే గళం జెడీ కావాలని, ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# షాప్ ముందు దిష్టిబొమ్మలా మహిళ ఫోటో

**సోషల్ మీడియాలో పంచుకున్న నెటిజన్**



**ముందడుగు బెంగుళూరు:**

కొత్త ఇల్లు నిర్మిస్తున్నప్పుడు ఇతరుల కళ్లు పడకుండా 'దిష్టి బొమ్మ'ను వేలాడదీస్తారు. అచ్చం అలానే ఓ వ్యాపారస్తుడు తన షాప్ ముందు ఓ మహిళ ఫోటో వేలాడదీశాడు. తన వ్యాపారంపై నరుల దిష్టి పడకుండా ఈ ప్రయత్నం చేశారు. కాని వేలాడదీసిన ఆ ఫోటో ఎవరనేదే ఇక్కడ సస్పెన్స్‌గా మారింది. బెంగుళూరులోని ఓ కూరగాయల దుకాణంలో వేలాడుతున్న మహిళ ఫోటోను ఓ నెటిజెన్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ ఫోటో చూశాక తాను నవ్వుకున్నానని అర్థం వచ్చేలా.. నేను ఈ రోజు బయటకు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది అని నెటిజెన్ క్యాప్షన్‌లో రాసుకొచ్చారు. ఫోటోల గల స్త్రీ విశాలమైన కళ్లతో కోపంగా చూస్తున్నట్లు ఉంది.